క్లుప్తంగా

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడండి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

నగరి: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్‌కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం మండలంలో తాగునీటి సమస్యలపై ఆరాతీశారు. వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీపీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తికి నివాళి


నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: రాజ్యసభ్య సభ్యుడు ఒంగోలు మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ(85) అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి మంగళవారం ఒంగోలు జిల్లా మేదటమెట్ల గ్రామానికి చేరుకు వైవీ సుబ్బారెడ్డి తల్లి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు ఉన్నారు.

ట్రాక్టర్లకు రికార్డులు తప్పనిసరి


ట్రాక్టర్ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్టీఓ గాయత్రి

పాలసముద్రం: మండలంలో ఇసుక తీసుకొచ్చే ట్రాక్టర్లకు అన్ని రకాల రికార్డులు, డ్రైవర్లకు లైసెన్స్ తప్పక ఉండాలని రోడ్డు రవాణాశాఖ ఆర్టీఓ గాయత్రి తెలిపారు. మంగళవారం పాలసముద్రంలో రోడ్డుపై ఇసుక తీసుకొచ్చేందుకు వెళ్తున్న ట్రాక్టర్ రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక తీసుకొస్తున్న ట్రాక్టర్‌కు అన్ని రికార్డులు తప్పక ఉండాలని తెలిపారు. ఇసుక ఉచితంగా ఇస్తున్నారని తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు లేని ట్రాక్టర్లకు జరిమానా వేశారు. కొంతమంది ట్రాక్టర్లకు రాజకీయ ఒత్తిడి వల్ల జరిమానా వేయకుండా వదిలేశారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

నింద్ర: మండలంలోని ఎస్సీ రైతులకు వివిధ పంటల సస్యరక్షణపై మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట సస్యరక్షణ, పురుగు మందుల పిచికారీ చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను శాస్త్రవేత్త వేమన వివరించారు. అనంతరం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హరి ప్రసాద్, వ్యవసాయాధికారి తులసీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని గజదాడులు


దెబ్బతిన్న పంటను అటవీశాఖ అధికారులకు చూపుతున్న రైతు

యాదమరి: మండలంలో గజదాడులు కొనసాగుతున్నాయి. సిద్ధారెడ్డిపల్లె పంచాయతీకి చెందిన రైతు అయ్యస్వామిరెడ్డి వరి పంటను మంగళవారం ఏనుగులు ధ్వంసం చేశాయి. బాధిత రైతు ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటను పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారుల నివేదిక సమర్పిస్తామని అటవీశాఖ అధికారులు చెప్పారు. గజదాడులను కట్టడి చేసేందుకు శాఖ అధికారులు ప్రయత్నం చేస్తున్నా..ఫలితం మాత్రం శూన్యం. ప్రస్తుతం రాచూరు అటవీ బీట్ పరిధిలో 14 ఏనుగులు హల్‌చల్ చేస్తున్నట్లు సమాచారం.

అధ్వాన రోడ్లు.. ప్రయాణానికి అగచాట్లు

- నియోజకవర్గంలో దుస్థితిలో ఉన్న గ్రామీణ రోడ్లు
- కంకర తేలి గుంతలమయం
- రాకపోకలు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు

సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులుగా రోడ్లను చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. సంక్రాంతి కూడా దాటిపోయి రెండు నెలలైంది. అయినా నగరి నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల రూపురేఖలు మారలేదు. కంకర తేలి గుంతలమయమైన రోడ్లలోనే పాదచారులు, వాహనదారులు అవస్థల నడుమ ప్రయాణం చేస్తున్నారు.

విజయపురం: నగరి నియోజకవర్గంలో ఐదు మండలాలు, మొత్తం 107 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. విజయపురం మండలంలో 25, వడమాలపేట మండలంలో 22, నగరి మండలంలో 18, నింద్ర మండలంలో 25, పుత్తూరు మండలంలో 18 చొప్పున పంచాయతీలు ఉన్నాయి. విజయపురం మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బ తిని రాళ్లు తేలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంగమాంబపురం నుంచి బూచివానత్తం వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని, రాళ్లుతేలి, గుంతలతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో వాహన రాకపోకలకు నానా అగచాట్లు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అలాగే గాండ్ల కండ్రిగ రోడ్డు నుంచి మంగళం మీదుగా విజయపురం వెళ్లే రోడ్డు సైతం ఇదే పరిస్థితి. నిత్యం అధికారులు వెళ్లుతున్నా వాటిని పట్టించుకోవడం లేదు. వడమాలపేట మండలం కేంద్రం నుంచి తిరుమణ్యం మీదుగా అప్పలాయిగుంట వెళ్లే రోడ్డు అక్కడక్కడా రాళ్లుతేలి గుంతలు పడ్డాయి. ఈ మార్గంలో కూడా వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం మాటలను చేతల్లో చూపి రోడ్లకు బాగు చేయాలని కోరుతున్నారు.


గుంతలమయమైన గంగమాంబపురం రోడ్డు


కంకర తేలిన గాండ్లకండ్రిగ రోడ్డు


తిరుమణ్యం రోడ్డు దుస్థితి ఇలా..

నోటీస్ బోర్డు

22న పుత్తూరులో జాబ్‌మేళా

పుత్తూరు: ఈనెల 22న ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి మంగళవారం తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిక్సన్, మైథిలి లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నవ భారత్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారని, ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, ఎంఎస్సీ, బీఎస్సీ కెమిస్ట్రీ, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు ఇంటర్వ్యూలకు అర్హులని తెలియజేశారు. ఆసక్తి కలిగిన వారు సర్టిఫికెట్లు, ఐడీ ప్రూఫ్‌తో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 6300954441 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉపాధి గ్రామసభ వాయిదా

విజయపురం: బుధవారం విజయపురంలో నిర్వహించాల్సిన జాతీయ ఉపాధి హామీ బహిరంగ గ్రామసభను అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్లు ఏపీఓ బబిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నులిపురుగుల నివారణపై అవగాహన


పాఠశాలను సందర్శిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ గిరి

గంగాధరనెల్లూరు: నులిపురుగుల నివారణపై అవగాహన అవసరమని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ గిరి అన్నారు. మంగళవారం ఆయన విజయం స్కూల్, ఎల్లమరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం నులిపురుగుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా జీవించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తే భవిష్యత్‌లో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ స్వామిదాస్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులకే ప్రాధాన్యత ఇవ్వండి


మాట్లాడుతున్న బీఐఎస్ మెంటర్ ఉజ్వల

కార్వేటినగరం: భారత ప్రామాణికత ఉన్న వస్తువులనే కొనుగోలు చేయాలని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం విద్యార్థులకు బీఐఎస్ మార్క్ కలిగిన వస్తువుల కొనుగోలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ క్యూఆర్ యాప్ ద్వారా మొబైల్‌లోనే వస్తువు నాణ్యతను కనుక్కోవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన వారికి ఉపాధ్యాయుల చేతుల మీదుగా నగదు బహుమతితో పాటు అవార్డును అందించారు. అనంతరం అనంతరం బీఐఎస్ మెంటర్ ఉజ్వల మాట్లాడుతూ వస్తువుల కొనుగోలులో ఎవరూ మోసపోకుండా చూడడానికి ఇలాంటి సమావేశాలు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సామాజిక సేవ అభినందనీయం


రోగులను పరీక్షిస్తున్న అపోలో హాస్పిటల్ వైద్యులు

తవణంపల్లె: సామాజిక సేవల్లో జర్నలిస్టుల పాత్ర అభినందనీయమని స్థానిక తహసీల్దార్ సుధాకర్ అన్నారు. తవణంపల్లె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఎస్ఐ చిరంజీవి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం స్థానిక వైద్యాధికారి ప్రియాంక, అపోలో వైద్యులు డాక్టర్ ప్రీతి, విద్యార్థులు జ్యోతిప్రజ్వలన చేశారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అతిథులు మాట్లాడుతూ ఎంతో ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రెస్‌క్లబ్ ద్వారా వైద్య పరీక్షలు చేయించి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేయించారు. బీపీ, సుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అరగొండ అపోలో హాస్పిటల్ జీఎం డాక్టర్ వినోద్‌కుమార్, బీఎం చంద్రశేఖర్ రెడ్డి, వైద్యాధికారి మోహన్‌వేలు, ఏఓ ప్రవీణ్, ఏపీఎం రవి, హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లోకనాథం, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌బాబు, కాశీశ్వర్‌రెడ్డి, తవణంపల్లె ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని గిరింపేట సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. బ్రేకర్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కావడంతో సెక్షన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అనంతరం అక్కడ పరిశీలన చేసిన అధికారులు సమస్యను గుర్తించారు. ప్రత్యామ్నాయంగా మరో సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అందించారు. చివరిగా రూ.7.5 లక్షల విలువైన బ్రేకర్‌ను బిగించారు. వీటిని టెస్ట్ చేసి సరఫరాను ఇచ్చారు.

వేరుశనగలో కొత్త వంగడాలను సాగు చేయాలి


చెర్లోపల్లెలో మాట్లాడుతున్న ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి

తవణంపల్లె: వేరుశనగలో కొత్త వండాలను సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లెలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్, ఆయిల్ సీడ్ పథకం కింద ఎస్సీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి మాట్లాడుతూ వేరుశనగ పంటలో మేలైన, వివిధ రకాల రోగాలను తట్టుకునే కొత్త రకాల విత్తనాలు గురించి వివరించారు. వ్యవసాయాధికారి ప్రవీణ్ ప్రభుత్వ పథకాలు, సేంద్రియ వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హైవేలో బారికేడ్లు ఏర్పాటు


నూతన బారికేడ్ల వద్ద డీఎస్పీ, సీఐ

నగరి: హైవేలో ప్రమాదాల నివారణకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. మంగళవారం కీళపట్టు వద్ద నగరి–తిరుత్తణి రోడ్డులో వేగ నియంత్రణ కోసం వీటిని ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ చెప్పారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు గుర్తించి ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ విక్రమ్ పాల్గొన్నారు.

పీ-4 సర్వేపై సమీక్ష


సమీక్షిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి

పాలసముద్రం: మండలంలో పీ–4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది క్లస్టర్ల వారీగా ఆయా కుటుంబాల నుంచి సామాజిక, ఆర్థిక స్థితిగతులను 27 ప్రశ్నల ఆధారంగా సమాచారాన్ని ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేయాలి. కొందరు సర్వేలు చేయడం వల్ల ఇబ్బందులు పడవచ్చని, కానీ పీ–4 సర్వే పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుంభాభిషేక పూజలు


కుంభాభిషేక పూజల్లో భక్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీవిశ్వ షిరిడి సాయిబాబా ఆలయంలో మంగళవారం కుంభాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి అభిషేకం, కలశ పూజలు శాస్త్రోక్తంగా చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గాలికుంటు ప్రాణాంతకం

యాదమరి: పశువులలో గాలి ద్వారా సంక్రమించే గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమని, పశు సంరక్షణ సహాయకుడు విక్రమ్ అన్నా రు. ఆయన కొట్టాలం పంచాయతీ సాయినగర్ కాలనీలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి సోకడం వల్ల పాల ఉత్పత్తి మరియు పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందని తద్వారా రైతుకు ఆర్థికంగా నష్టం చేకూరుతుందని చెప్పారు.

వృద్ధులకు సేవలు అందించడం అదృష్టం


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ భువనేశ్వరి

కార్వేటినగరం: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వైద్య సేవలు అందించడం తమ అదృష్టమని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వృద్ధులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, 15 రోజులకు ఒక్కసారి బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆహారపు అలవాట్లలో మార్పు రావాలని, తేలికగా జీర్ణం అయ్యే వాటిని మాత్రమే తీసుకోవాలన్నారు. అనంతరం బీపీ, షుగర్‌తో పాటు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ గౌరి, ఎంఎల్‌హెచ్‌పీ కవిత, ఏఎస్ఎం సుమతి, ఆశావర్కర్లు, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇంటి వద్ద చదివించాలి


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం బాబు

పాలసముద్రం: తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద కూర్చోబెట్టి చదివించాలని హెచ్‌ఎం బాబు తెలిపారు. మంగళవారం ఆముదాల తమిళ్ మీడియం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకుంటే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను తల్లిదండ్రులు తమ ఇంటి వద్ద కూర్చోబెట్టి చదివించాలన్నారు. అప్పుడే పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారని చెప్పారు. అనంతరం తల్లిదండ్రుల ఎదుట విద్యార్థులకు పలు ప్రశ్నలు వేయగా, వారు చక్కగా సమాధానం చెప్పడంతో సంతోషపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించరూ!


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

- పంచాయతీ కార్యదర్శుల నివేదన'

నగరి: ప్రభుత్వ పథకాలను అమలు, పంచాయతీ పరిపాలనలో కార్యదర్శులు పాత్ర కీలకమైందని, అయితే వివిధ సర్వేల కారణంగా తమపై తీవ్రంగా పనిభారం పడుతోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. దీని మూలాన మానసిక ఒత్తిళ్లు, అనారోగ్యం బారిన పడుతున్నట్టు పేర్కొన్నారు. తమకు పనిభారం తగ్గించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ కృష్ణయ్యకు వినతి పత్రం సమర్పించారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పరిపాలన, శాఖాపరమైన పనులతోపాటు సచివాలయం నిర్వహణ, సర్వేలతో పడుతున్న ఇక్కట్లను నివేదించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, నిషా, సునీత, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మాధవి

గుడిపాల: రైతులందరూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట సంఖ్య ఇవ్వడం ద్వారా పథకాలు అందించడానికి సులభతరంగా ఉంటుందన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో వీఏఏలకు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, మొబైల్ నంబర్ తీసుకొని వివరాలు నమోదు చేసుకున్న తరువాత ఈ విశిష్ట సంఖ్యను పొందవచ్చని తెలిపారు. దీనిద్వారా వివిధ రకాల రాయితీలు, పథకాలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అనంతరం వేరుశనగ, వరిపంటలో కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కూరగాయల పంటలో పొగాకు లద్దెపురుగు యాజమాన్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పర్యటన


పీవీ పురం శ్మశానానికి దారి విషయమై మాట్లాడుతున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతుల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ లోకనాథపిళ్లై మంగళవారం శ్రీరంగరాజపురం మండలంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా తమ మండలం నుంచి కలెక్టర్ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని చిలమాకలపల్లి జిల్లా పరిషత్ పాఠశాల స్థలం ఆక్రమణకు గురైనట్లు అందిన వినతి ప్రకారం కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేయడం కోసం గ్రామస్తులతో చర్చించి రికార్డులను పరిశీలించారు. అలాగే పాదలపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో అక్రమణలు ఉన్నట్లు గతంలో రెండు మూడుసార్లు గొడవలు చోటు చేసుకున్నాయని, ఘర్షణలు పెరుగుతున్న నేపథ్యంలో దీనిపై దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు. అలాగే గ్రామంలోకి వెళ్లి పాఠశాల స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం ఎన్ని వినతులు వచ్చాయని వీఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పీవీ పురం దళితవాడ శ్మశానానికి రోడ్డు విషయమై పరిశీలించారు. అలాగే కృష్ణాపురం జలాశయం నుంచి ఏరు కాలువ మీదుగా శ్మశాన వాటికకు వెళ్లాల్సి ఉంటే ఆ కాలువలో నీరు ఉండడం వల్ల వెళ్లలేని పరిస్థితి అని, పక్కనే పూడ్చివేసిన కాలువ మీదుగా దారి కావాలని గ్రామస్తులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ కాలువను పరిశీలించి గ్రామస్తులు మాట్లాడుకుని దారి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.